
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి మెదక్ జిల్లాల వార్తలు

5

శుక్రవారం 6 జూన్ 2025

## మెదక్ ఎస్పీగా శ్రీనివాస్‌రావు బాధ్యతల స్వీకరణ

మెదక్ అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా ఎస్పీగా డీవీ శ్రీనివాసరావు గురువారం బాధ్యతలను స్వీకరించారు. 2007 బ్యాచ్‌కు చెందిన శ్రీనివాస్‌రావు ఆసిఫాబాద్ ఎస్పీగా పని చేస్తూ బదిలీపై మెదక్ జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటూ చట్ట పరిధిలో ప్రజల సమస్యలను పరిష్కారిస్తామని ఆయన తెలిపారు. జిల్లా పోలీసు అధికారులు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు.

## నిజాంపూర్ పాఠశాలకు రాష్ట్రస్థాయి గ్రీన్ చాంపియన్ అవార్డు

సంగారెడ్డి అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన సంస్థలకు ప్రభుత్వం రాష్ట్ర స్థాయి గ్రీన్ చాంపియన్ పురస్కారాలను ప్రకటించింది. పాఠశాల విభాగంలో ప్రకటించిన మూడు పురస్కారాల్లో సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలోని నిజాంపూర్-శే ప్రాథమిక పాఠశాలకు స్థానం దక్కింది. గురువారం హైదరాబాద్ సనత్‌నగర్‌లోని తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ అవార్డును పొందారు. రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా ఆయన పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం రామకృష్ణను డీఈవో వెంకటేశ్వర్లు, జిల్లా సెక్టోరియల్ అధికారులు వెంకటేశం, బాలయ్య, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి అభినందించారు.



హైదరాబాద్‌లో అవార్డు అందుకున్న హెచ్ఎం రామకృష్ణ

## కాళ్లకల్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల పారిశుధ్య కార్మికురాలికి పురస్కారం

మనోహరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కాళ్లకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికురాలు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డును అందుకున్నారు. ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా కాళ్లకల్ జడ్పీహెచ్ఎస్‌లో పనిచేస్తున్న అస్కరి జయలక్ష్మీకి పారిశుధ్య విభాగంలో పురస్కారాన్ని పొందారు. రాష్ట్ర విద్యా విభాగ జాయింట్ డైరెక్టర్ వెంకట నరసింహ ఆమెను సన్మానించి అవార్డు అందజేశారు.



పారిశుధ్య కార్మికురాలు జయలక్ష్మిని సన్మానించిన దృశ్యం

చేపల కొలను తవ్వుతున్న ఉపాధి హామీ కూలీలు



# చెరువు గట్టున.. చేపల కొలనులు

## మత్స్యకారులకు ప్రోత్సాహకంగా ఫిష్ పాండ్‌ల నిర్మాణం

**ఉపాధి హామీ ఊతంతో మత్స్యకారులకు చేయూతను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. చెరువు గట్టున చేపల కొలనుల (ఫిష్ పాండ్‌లు)ను నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. చెరువు శిఖంలోనే తవ్వించి ఉపాధి కూలీలకు పని కల్పించడంతో పాటు చెరువు భూముల పరిరక్షణ, గంగపుత్రులకు మరింత ఆదాయం సమకూర్చడమే దీని లక్ష్యం. ఈ మేరకు మెదక్ జిల్లాలో 200 చేపల కొలనులను తవ్వించనున్నారు.**

జాతీయ ఉపాధిహామీ ద్వారా పనులు

చెరువు శిఖం భూమిలోనే తవ్వకాలు

కొలనుల్లో చేపల గ్రేడింగ్‌కు అవకాశం

మెదక్ జిల్లాలో 200 ఫిష్ పాండ్‌లు

తూప్రాన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖ ఆధ్వర్యంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని చెరువుల్లో చేపల పెంపకం చేస్తున్నారు. ప్రతీ యేటా వర్షాలు కురిసి చెరువుల్లోకి నీరు రాగానే మత్స్యశాఖ చేప పిల్లలను తీసుకువచ్చి చెరువుల్లో వదిలి పెడుతుంది. చెరువుల్లో చేప పిల్లలు పెరిగిన తరువాత మత్స్యకారులు చేపలు పట్టి అమ్మకం చేసి ఉపాధి పొందుతునున్నారు. చెరువుల్లో వదిలిన చేపల పెంపకం బాధ్యతలను మత్స్యకార సంఘాలు చూస్తుంటాయి. చెరువుల్లో చిన్న సైజు చేప పిల్లలను వదిలి పెట్టడంతో కొంత వరకు చేప పిల్లలు చనిపోతున్నాయి. చెరువుల్లో ఉన్న పెద్ద సైజు చేపలు సైతం చిన్న పిల్లలను తినే ఆస్కారం కూడా ఉంటుంది. అయితే, చేప పిల్లలను బయటే కొంత వరకు పెంచి చెరువుల్లో వదలితే నష్టాలు తగ్గించవచ్చని భావించింది. ఈ కోవలో మత్స్యకారులకు సహకారం అందజేసేందుకు చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన ఫిష్ పాండ్‌లతో ఈ నష్టాలకు చెక్ పెట్టే అవకాశం ఉంది.

### గ్రేడింగ్ ద్వారా చేపల పెంపకం

గ్రేడ్‌లుగా సైజు పెరిగిన చేపలను చెరువులో వదిలితేనే ఎక్కువ చేపలు బతికి పెరుగుతాయి. ఇందు కోసం చేపల సైజును బట్టి గ్రేడింగ్ చేసేందుకు వీలుగా శిఖం భూముల్లో నాలుగు కొలనుల నిర్మాణం చేస్తున్నారు. చేప విత్తనాలను నేరుగా చెరువుల్లో కాకుండా ఈ కొలనుల్లో మొదటగా విడిచిపెట్టనున్నారు. మొదట ఒక కొలనులో చిన్న చేపలను ఓ సైజు వరకు పెంపకం చేస్తారు. అందులో పెరిగిన చేప పిల్లలను మాత్రమే మరో కొలనులోకి వదలుతారు. ఇంకొంత సైజు పెరగానే ఇంకో కొలనులోకి మార్చుతారు. పెరిగిన చేప పిల్లలను ఇలా గ్రేడింగ్‌లుగా కొలనుల్లో పెంచుతారు. సరైన సైజు రాగానే కొలనుల్లో నుంచి తీసి చెరువుల్లో వేసి పెంపకం చేస్తారు. అయితే, ఫిష్ పాండ్‌లతో పాటు సమీపంలో బోరు ఏర్పాటు చేస్తే నీటి వసతి కల్పించేందుకు అవకాశం

మిగతా 8వ పేజీలో



నిర్మాణం పూర్తయిన చేపల కొలను

### బోరు వేస్తే బాగుండేది



చెపల పెంపకం కోసం ఫిష్ పాండ్‌లను నిర్మించడం బాగుంది. చెరువుల వద్దనే వీటిని నిర్మిస్తుండంతో చేపల పెంపకం భారీగానే జరుగుతుంది. ఫిష్ పాండ్‌లకు అనుబంధంగానే చెరువుల వద్ద బోరు వేస్తే మాకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేయాలి.

- మన్నె నర్సింగ్‌రావు, మత్స్యకారుడు, ఇమాంపూర్

### కొలనుల నిర్మాణానికి ప్రాధాన్యం



ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తుంది. ఇందులో భాగంగా చేపల కొలనుల నిర్మాణానికి ప్రాధాన్యమిస్తున్నాం. మెదక్ జిల్లాలోని మత్స్యకార సంఘాల కోసం 200ల వరకు నిర్మాణం చేస్తున్నాం. ఇప్పటికే 50 పాండ్‌ల నిర్మాణం పూర్తయ్యింది. మత్స్యకార సంఘాలు ముందుకు వచ్చి ఉపయోగించుకొని ఉపాధి పొందాలి.

- చెన్నమనేని శ్రీనివాస్‌రావు, డీఆర్డీవో

# హరిత లక్ష్యం.. కార్యాచరణ సిద్ధం

*సంగారెడ్డి జిల్లాలో 38 లక్షల మొక్కలు టార్గెట్*

ఈ నెల 15 నుంచి వన మహోత్సవం కార్యక్రమం

జిల్లాలో 619 నర్సరీల్లో మొక్కలు పెంపకం

సంగారెడ్డి టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో 11వ విడత మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. ఇటీవల తొలకరి పలుకరించడంతో మొక్కలు నాటేందుకు కార్యాచరణ రూపొందించారు. ఈనెల 15 నుంచి వన మహోత్సవానికి శ్రీకారం చుట్టనున్నారు. జిల్లాలో 38 లక్షల మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యాన్ని నిర్దేనించారు. ఈ మేరకు ఆయా ప్రభుత్వ శాఖలకు టార్గెట్‌లను నిర్ణయించారు.

### నర్సరీలలో వివిధ రకాల మొక్కల పెంపకం

జిల్లాలోని 619 నర్సరీల్లో వివిధ రకాల మొక్కలను పెంచారు. రావి, వేప, చింత, తెల్లమద్ది, మామిడి, నల్లమద్ది, గానుక, ఈత, తాటి, గంగరావి తదితర మొక్కలు నాటాలని నిర్ణయించగా, ఆయా నర్సరీల్లో ఈ మొక్కలను పెంచుతున్నారు. ప్రభుత్వానికి చెందిన ఖాళీ స్థలాలు, రహదారులు, జల వనరులు ఉన్న చోట, పంట పొలాలు, గట్లు, తదితర స్థలాల్లో మొక్కలు నాటనున్నారు. ప్రతీ నర్సరీలో మొక్కలు సిద్ధం చేయడం, తరలించడం, వన మహోత్సవంలో మొక్కలను నాటేందుకు ప్రభుత్వం రూ.2.70 కోట్లను వెచ్చించనున్నది. జిల్లాలోని ఆయా ప్రభుత్వ విభాగాలకు మొక్కలు నాటే బాధ్యతను కలెక్టర్ క్రాంతి వల్లూరు లక్ష్యాలను విధించారు. అలాగే సంరక్షణ బాధ్యతలను చేపట్టాలని సూచించారు. మున్సిపాలిటీలు, పంచాయతీల్లోనూ మొక్కల నాటేందుకు ప్రత్యేక లక్ష్యాలను నిర్ణయించారు. పాఠశాలలు, ఆస్పత్రులు, పారిశ్రామిక ప్రాంతాల్లో విరివిగా నాటేలా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ప్రధాన రోడ్లతో పాటు, గ్రామాల రోడ్లలోనూ ఇరువైపులా నాటాలని అధికారులను ఆదేశించారు.

### ఆయా శాఖలకు లక్ష్యాల కేటాయింపు

డీఆర్డీవోకు 23 లక్షలు, ఎక్సైజ్ విభాగానికి 2.75 లక్షలు, అటవీ శాఖకు 1.20 లక్షలు, ఉద్యాన శాఖకు 75 వేలు, టీజీఐఐసీకి 75 వేలు, ఇరిగేషన్‌కు 18,750, పోలీసు శాఖకు 3,750, మహిళా శిశు సంక్షేమ శాఖకు 1100 మొక్కలు నాటాలని టార్గెట్‌లను విధించారు. అలాగే మున్సిపాలిటీలలోనూ మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలో ఎనిమిది మున్సిపాలిటీలలో మొక్కలు నాటే స్థలాలను ఇదివరకే గుర్తించారు. సంగారెడ్డి పట్టణంలో 75 వేలు, అమీన్‌పూర్‌లో 75 వేలు, ఆందోల్-జోగిపేటలో 37,500, ఐడీఏ బొల్లారంలో 45 వేలు, నారాయణఖేడ్‌లో 37 వేలు, సదాశివపేటలో 45 వేలు, జహీరాబాద్‌లో 75 వేల మొక్కలు నాటాలని నిర్ణయించారు.

నర్సరీలలో సిద్ధంగా ఉన్న మొక్కలు



# గురుకులాల్లో 'ఫోన్ మిత్ర'

విద్యార్థులకు స్మార్ట్ కార్డులు జారీ

తల్లిదండ్రులతో మాట్లాడే వెసులుబాటు

ఈ విద్యాసంవత్సరం నుంచి అమలు

సంగారెడ్డి అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు తమ తల్లిదండ్రులతో మాట్లాడేందుకు వీలుగా సర్కారు ఓ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలల్లో 'ఫోన్ మిత్ర' కార్యక్రమం పేరిట ఫోన్లు ఏర్పాటు చేసింది. ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగా, జిల్లాలో 12 సాంఘిక సంక్షేమ గురుకులాలు ఉన్నాయి. వాటన్నింటిలో ఫోన్ మిత్ర కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే ఫోన్లు ఏర్పాటు చేశారు.

### నలుగురికి కలిపి ఒక స్మార్ట్ కార్డు

ఫోన్ మిత్ర కార్యక్రమంలో భాగంగా ప్రతీ నలుగురు విద్యార్థులకు కలిపి ఒక స్మార్ట్ కార్డును జారీ చేయనున్నారు. స్మార్ట్ కార్డుతో రోజులో 25 నిమిషాల పాటు వారి తల్లిదండ్రులతో మాట్లాడే వెసులుబాటు కల్పించనున్నారు. స్మార్ట్ కార్డు కేటాయించే సమయంలో తొలుత వారి తల్లిదండ్రులు ఏదైనా సెల్‌ఫోన్ నెంబర్‌ను పాఠశాల సిబ్బంది వద్ద నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. కేవలం ఆ నంబర్‌కు మాత్రమే స్మార్ట్ కార్డు ద్వారా ఫోన్ చేసే అవకాశం ఉంటుంది. ఇదిలా ఉంటే పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి గురుకుల సొసైటీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. విద్యార్థులు వారి సమస్యలను చెప్పుకొనేందుకు అవకాశం సైతం కల్పించారు. గతంలో ఏమైనా సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రస్తుతం పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న ఫోన్ మిత్ర కార్యక్రమం ద్వారా నేరుగా టోల్ ఫ్రీ నంబరుకు కాల్‌చేసి ఉన్నతాధికారులతో మాట్లాడే సదుపాయం ఉంది. కాగా ఈ విద్యా సంవత్సరం విద్యార్థులు తిరిగి పాఠశాలల్లో చేరే సమయానికి ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయని సాంఘీక సంక్షేమ గురుకులాల ఉన్నతాధికారి తెలిపారు.



ఎస్సీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన స్మార్ట్‌కార్డుతో పనిచేసే ఫోన్



# చదువుతోనే భవిష్యత్తుకు బాటలు

పర్యావరణ పరిరక్షణ దినచర్యలో భాగం కావాలి

రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

జహీరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : చదువుతోనే భవిష్యత్తుకు బాటలు పడుతాయని, రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం జహీరాబాద్ పట్టణంలో ఓ ప్రైవేటు పాఠశాలను మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్, జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్‌తో కలిసి మాట్లాడారు. చదువుకున్న వారుంటేనే ఆ కుటుంబాలు బాగుపడుతాయన్నారు. మారుతున్న కాలానుగునంగా సాంకేతిక విద్య అందుబాటులో వచ్చినందున తల్లిదండ్రులు విద్యార్థులను ఈదారిలో ప్రోత్సహించాలని సూచించారు. తెంగాణ రాష్ట్రం విద్యలో నెంబర్‌వన్‌గా ఉండాలంటే ప్రజలు, తల్లిదండ్రులు సహకరించాలన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతుందన్నారు. పాఠశాలల్లో డ్రాప్‌అవుట్‌లు లేకుండా చూడాలన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాట్లాడుతూ కాలుష్య వాతావరణం వల్ల ఆరోగ్యాలపై తీవ్రప్రభావం చూపనుందన్నారు. ఎక్కడపడితే అక్కడ మొక్కలను నాటాలని, చెట్లను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ దినచర్యలో భాగం కావాలని పిలుపునిచ్చారు. ప్రజల సహకారం ఉంటేనే ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు విజయవంతం అవుతాయన్నారు. మహిళా సంఘాల అభ్యున్నతిలో భాగంగా ఆర్టీసీకి అద్దె బస్సుల పథకాన్ని చేపట్టామన్నారు. గతంలో ఆర్టీసీ నిర్లక్ష్యానికి గురైందని, లాభాల బాటలో కొనసాగించేలా కృషి చేస్తున్నామని పొన్నం తెలిపారు. పీఎం ఈడ్రైవ్ కింద త్వరలో రాష్ట్రానికి 2,800 బ్యాటరీలతో నడిచే ఈవీ బస్సులు వస్తున్నామని ప్రకటించారు. అవి త్వరలో హైదరాబాద్‌లో తిరుగనున్నాయన్నారు. హైదరాబాద్‌లో తిరిగిన బస్సులను ఆయా ప్రాంతాల డిపోలకు పంపించడం జరుగుతుందన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక నూతన విధానాలతో కొత్త బస్సులు, కొత్త డిపోలు, కొత్త ఉద్యోగులతో కళకళలాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సిద్ధం ఉజ్వల్‌రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ ఎంపీ కార్యాలయం ఇన్‌చార్జి శుక్లవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## పాఠశాలల లైబ్రరీలకు పుస్తకాలు

సంగారెడ్డి అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : సర్కారు బడి పిల్లల్లో సృజనాత్మక పెంచడానికి విద్యాశాఖ పలు సంస్కరణలు అమలు చేస్తున్నది. విద్యార్థులు చదవడంతో పాటు, అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చాలనే ఉద్దేశంతో సమగ్ర శిక్ష ద్వారా పాఠశాలల లైబ్రరీలకు పుస్తకాల సరఫరాకు చర్యలు తీసుకున్నది. జిల్లా కేంద్రమైన సంగారెడ్డికి లైబ్రరీ పుస్తకాలు చేరుకోగా, వాటిని జిల్లా సైన్స్ కేంద్రంలో భద్రపరిచారు. జిల్లా వ్యాప్తంగా 1264 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిల్లో సుమారు లక్ష పది వేల మంది విద్యనభ్యసిస్తున్నారు. అయితే, జిల్లాలో 44 పాఠశాలలు పీఎంశ్రీ కింద ఎంపికయ్యాయి. ఈ పాఠశాలలను మినహాయించి మిగిలిన అన్ని ప్రభుత్వ పాఠశాలల లైబ్రరీలకు పుస్తకాలు సరఫరా చేయనున్నారు. 996 సెట్ల పుస్తకాలు జిల్లాకు చేరుకోగా, త్వరలో వాటిని పాఠశాలలకు సరఫరా చేయనున్నట్లు సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్ బాలయ్య తెలిపారు.



సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ కేంద్రంలో లైబ్రరీ పుస్తకాలు

## బైక్ పై నుంచి పడి కోమాలోకి బాలిక

రామాయంపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బైకుపై ప్రయాణిస్తూ ఓ బాలిక కిందపడి తీవ్రమైన గాయాలై కోమాలోకి వెళ్లింది. బుధవారం రాత్రి రామాయంపేట పాత హైవేపై ఈ ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే.. నిజాంపేట ప్రాంతానికి చెందిన బాలిక మరో ఇద్దరు యువకులతో కలిసి బైక్ పై ప్రయాణిస్తుంది. రామాయంపేట శివారులో ఒక్కసారిగా అదుపుతప్పి పడిపోగా ఆమెకు బలంగా దెబ్బలు తగిలాయి. వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే ప్రస్తుతం బాధితురాలు కోమాలోకి వెళ్లినట్లు గ్రామస్థులు ద్వారా తెలిసింది.

## తేనెటీగల దాడిలో వ్యక్తి మృతి


మృతి చెందిన తిరుపతి (ఫైల్ ఫోటో)

సిద్దిపేట రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తేనెటీగల దాడిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం చింతమడక గ్రామ పంచాయతీ పరిధిలోని అంకంపేట గ్రామంలో జరిగింది. సిద్దిపేట రూరల్ ఎస్సై అపూర్వ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ముత్యాల తిరుపతి (55) వ్యవసాయంతో పాటు గొర్రెలను మేపుకుంటూ జీవించేవాడు. రోజూలాగే ఉదయం గొర్రెలను మేపడానికి పొలం వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో పక్క పొలంలోని చింత చెట్టుకు ఉన్న తేనెటీగలు అతనిపై దాడి చేసి, ముఖం, శరీరంపై కుట్టడంతో కింద పడిపోయాడు. విషయం తెలుసుకున్న తిరుపతి కొడుకు రాజు అతడిని సిద్దిపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించగా, పరీక్షించిన డాక్టర్లు అతడు అప్పటికే మరణించినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## అదుపు తప్పి చెట్టును ఢీ కొన్న కారు


ప్రమాదంలో ధ్వంసమైన కారు ముందు భాగం

చిన్నకోడూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కారు అదుపు తప్పి చెట్టును ఢీకొనగా ఒకరికి తీవ్రమైన గాయాలు కాగా మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం చిన్నకోడూరు మండలం రాముని పట్ల గ్రామ శివారులో రాజీవ్ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన సోమ రాజయ్య, శివ, అనూష, మేఘన, మరొకరు పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి కారులో ఓ ఫంక్షన్‌కి వెళ్లి తిరిగి వస్తుండగా రామునిపట్ల శివారులోకి రాగానే కారు ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొట్టింది. దీంతో కారు ముందు భాగం ధ్వంసమై కారులో ఉన్న రాజయ్యకు తీవ్రమైన గాయాలు కాగా నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. రాజయ్యను 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై బాలకృష్ణ తెలిపారు.

## ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

పుల్‌కల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్‌కు చెందిన కావేరి అనే మహిళ బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పుల్కల్ ఎస్సై తెలిపారు. అందోల్ మండలం సంగుపేటకు చెందిన కావేరికి చౌట్కూర్‌కు చెందిన పోచయ్యతో గత సంవత్సరం వివాహం జరిగింది. వివాహం అనంతరం పలుమార్లు గర్భ స్రావం కావడం, అత్తామామలు వేధించడంతో మనస్తాపానికి గురైన కావేరి బుధవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

## అంబులెన్స్‌లో ప్రసవం


అంబులెన్స్‌లో ప్రసవించిన మహిళ

పాపన్నపేట, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : ఓ మహిళ అంబులెన్సులో ప్రసవించింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కొడుపాక గ్రామానికి చెందిన దీపికకు బుధవారం అర్ధరాత్రి ఒంటి గంటకు పురిటి నొప్పులు రావడంతో 108 వాహనానికి సమాచారం అందించారు. అక్కడి కి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది ప్రసవం కోసం మెదక్ మాతా శిశు సంరక్షణ ఆస్పత్రికి తరలిస్తుండగా నాగ్సాన్‌పల్లి శివారులోకి రాగానే దీపికకు ప్రసవం జరిగి ఆడబిడ్డకు జన్మించింది. అనంతరం ఈఎంటీ సతీష్, పైలట్ దుర్గాప్రసాద్‌లు వారికి అవసరమైన సేవలు అందించి ఆస్పత్రిలో చేర్పించారు.

## రోడ్డు ప్రమాదంలో డీసీఎం హెల్పర్ మృతి


న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో

చిన్నశంకరంపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో డీసీఎం క్లీనర్ మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం చిన్నశంకరంపేట మండలంలోని రుద్రారం గ్రామంలో జరిగింది. కుటుంబీకుల కథనం ప్రకారం సూరారం గ్రామ శివారు ఓ పరిశ్రమలో చాకలి యాదగిరి (42) హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. పరిశ్రమకు సంబంధించిన పనిపై హైదరాబాదుకు డీసీఎం వాహనంలో బయలుదేరాడు. ప్రమాదవశాత్తు రోడ్డుపై నిలిపి ఉన్న ట్రక్కును ఢీకొట్టడంతో యాదగిరి అక్కడికక్కడే మృతి చెందాడు. యాదగిరికి భార్య మంజుల, ఒక కూతురు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబీకులు, బంధువులు మృతుడి కుటుంబానికి న్యాయం జరగాలని డిమాండ్ చేస్తూ పోలీస్ స్టేషన్ ఎదుట మెదక్ చేగుంట రహదారిపై రాస్తారోకో, ఆందోళన చేపట్టారు. మృతుడి బంధువులు పరిశ్రమ యజమాన్యం పై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆగ్రహావేశాలకు గురయ్యారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బంధువులను శాంతింపజేసి మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు..


షేక్ అబ్దుల్ నబీ (ఫైల్ ఫోటో)

కౌడిపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తిని కారు ఢీకొట్టడంతో అతడు మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో జరిగింది. మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ నబీ (27) కొంత కాలంగా మెదక్‌లోని ఆర్‌డీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు . గురువారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై మెదక్ బయలు దేరాడు. కౌడిపల్లిలోని ఎల్లమ్మ దేవాలయం సమీపంలోనికి రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు బలంగా ఢీ కొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఇదే విషయంపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కౌడిపల్లి ఎస్సై రంజిత్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్..

కొండాపూర్,జూన్5(ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ మృతి చెందింది. ఈ సంఘటన కొండాపూర్ మండలంలో జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు మునిదేవునిపల్లి చెందిన దేవరంపల్లి రేణుక(58) 23 ఏళ్లుగా అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తుంది. ఏడాది క్రితం నుంచి క్యాన్సర్ బారిన పడింది. వారం రోజులకు ముందు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరింది. గురువారం చికిత్స పొందుతూ తీవ్రమైన అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో మృతి చెందినట్లు కుంటుబ సభ్యులు, గ్రామస్థులు తెలిపారు. రేణుక మృతి పట్ల మండల అంగన్‌వాడీ టీచర్ల సంఘం నాయకురాలు ఏసుమణి, అరుణలు ప్రగాఢ సానుభూతి వ్యక్త పరుస్తూ సంతాపాన్ని ప్రకటించారు.

## బైకు అదుపుతప్పి వ్యక్తి..

సిద్దిపేట రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) :బైక్ అదుపుతప్పి రోడ్డు డివైడర్‌కు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సిద్దిపేట రూరల్ ఎస్సై అపూర్వరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట అర్బన్ మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన శివరాత్రి బాలకృష్ణ (36) కూలీ పనులు చేసుకుంటూ ఉండేవాడు. కాగా రోజూలాగే పనికి వెళ్లిన బాలకృష్ణ సిద్దిపేట నుంచి బుధవారం రాత్రి 9 గంటల సమయంలో రామచంద్రనగర్‌కు వస్తుండగా, బైక్ అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను గుద్దుకొని కింద పడిపోయాడు. స్థానికులు అతడిని సిద్దిపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు తీసుకువెళ్లగా, చికిత్స పొందుతూ మరణించినట్లు తెలిపారు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో..

రామాయంపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన రామాయంపేట మండలం కాట్రియాలలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ధ్యాగల కుమార్ (30) బుధవారం ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. గురువారం తెల్లవారుజామున ఇంటికి చేరుకున్న కుమార్ ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. వెంటనే భార్య స్రవంతి చుట్టు పక్కల వారి సహాయంతో రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యానికి డబ్బు ఇవ్వలేదని ఆత్మహత్యాయత్నం

● ఆస్పత్రిలో మృతి

వెల్దుర్తి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రమైన వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని శేరి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శేరి గ్రామానికి చెందిన ఇక్కిరి యాదగిరి (41) మద్యానికి బానిసై మే31న తన భార్య స్వరూపను మద్యం తాగడానికి డబ్బులు అడగగా, పంట డబ్బులు వచ్చిన తరువాత ఇస్తానని చెప్పడంతో తనతో గొడవ పడ్డాడు. అదే రోజు మధ్యాహ్నం యాదగిరి పురుగుల మందు తాగాడు. దీంతో గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున యాదగిరి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి తల్లి బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## తల్లి మందలించిందని యువకుడు ఆత్మహత్య

హవేళిఘణపూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసైన కొడుకును తల్లి మందలించగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలో శుక్రవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం సర్దన గ్రామానికి చెందిన ఎండీ సర్దార్-బీబీపాషా దంపతులకు ఇద్దరు కుమారుల్లో చిన్నవాడైన ఎండీ సల్మాన్ (24) వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం సల్మాన్ పనులకు వెళ్లి రాత్రి ఇంటికి రాకపోవడంతో తల్లి బీబీ పాషా సరిగా పనులు ఎందుకు చేయడం లేదని మందలించింది. దీని వల్ల తీవ్ర మనస్తాపానికి గురైన సల్మాన్ గదిలోకి వెళ్లి దూలానికి చున్నితో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గదిలోకి వెళ్లి చాలా సేపైందని గది తలుపులు తట్టగా రాలేదు. దీంతో కిటికీ నుంచి చూడగా దూలానికి వేలాడుతున్నాడు. తండ్రి సర్ధార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాజు తెలిపారు. పంచనామ నిర్వహించి పోస్టుమార్టుకు పంపినట్లు పోలీసులు తెలిపారు.

## వరద కాలువలతో మురుగు సమస్యలు

రామచంద్రాపురం టౌన్ జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదలశాఖకు చెందిన వరదకాలువలతో మురుగు సమస్యలు పెరుగుతున్నాయని కార్పొరేటర్, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యురాలు పుష్పానగేష్ అన్నారు. ఈ మేరకు గురువారం జరిగిన జీహెచ్‌ఎంసీ సమావేశంలో ఆమె మాట్లాడారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని పాతరామచంద్రాపురం నుంచి మల్లికార్జున్‌నగర్ కాలనీవరకు వరదకాలువలు సమస్యగా మారి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. శుభ్రత ఎప్పటికప్పుడు చేయించాల్సి ఉంటుందని వివరించారు. ఇందుకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని కోరారు.



మంత్రి సీతక్కతో సంగారెడ్డి జిల్లా అధికారులు

## మేదో మథన సదస్సులో అధికారులు

సంగారెడ్డి రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో ఈ నెల 4, 5వ తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన మేదో మథన సదస్సుకు సంగారెడ్డి జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి వెళ్లిన వారిలో జిల్లా మహిళా సంక్షేమాధికారి లలితకుమారి, సీడీపీవోలు చంద్రకళ, ప్రియాంక, సూపర్‌వైజర్లు మణెమ్మ, కవిత, విమల, పోషణ్ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ సౌమ్యలు ఉన్నారు. వారు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతో కలిసి మాట్లాడారు.

## కుళ్లిన గుడ్ల సరఫరాపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హత్నూర, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాధుర అంగన్‌వాడీ కేంద్రానికి కుళ్లిన కోడిగుడ్లు సరఫరా చేసిన విషయమై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికి ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్యారాణి గ్రామానికి వెళ్లి అక్కడి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. ప్రభుత్వం పోషకాహారం కింద పంపిణీ చేస్తున్న గుడ్లు కుళ్లినవి ఇస్తే ఎలా అని ప్రశ్నించారు. వెంటనే కాంట్రాక్టర్‌ను తొలగించి, ఇకమీదట ఇలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని గర్భిణులు, తల్లులు కోరారు. దీంతో సూపర్‌వైజర్ స్పందిస్తూ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు, తాను కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తానని స్పష్టం చేశారు. ఆమె వెంట అంగన్‌వాడీ టీచర్ సుగుణ తదితరులు ఉన్నారు.

## పశు సంచార వాహన సిబ్బంది వేతన వెతలు

**3 నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు**



మెదక్ కల్చరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పశు సంచార వాహన సేవలు అందిస్తున్న సిబ్బంది గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్నారు. మూడు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో నర్సాపూర్, మెదక్‌లో ఒక్కొక్క వాహనం ద్వారా సేవలు అందిస్తున్నారు. ఇందులో 8 మంది సిబ్బంది ఉన్నారు. ఈ వాహనంలో (1962) పశు సంచార వాహనంలో పశువుల వైద్యుడు/ వైద్యురాలు, పారా మెడికల్ సిబ్బంది, వాహన డ్రైవర్ ఉంటారు. రోజూ మూగ జీవాలకు ఇంటి వద్దకే వెళ్లి సేవలు అందిస్తుంటారు. చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్నా వచ్చే జీతం నెల నెల రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మా జీతాలు విడుదల చేయాలని వేడుకుంటున్నారు.

## ఘనంగా సాయిబాబా దత్తాత్రేయ స్థిర ప్రతిష్ట



ధ్వజస్తంభానికి పూజలు నిర్వహిస్తున్న విశ్వంజీ మహారాజ్

శివ్వంపేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడూరు గ్రామంలోని గురుపీఠంలో గురువారం సాయిబాబా దత్తాత్రేయ విగ్రహ స్థిర ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. విశ్వయోగి విశ్వంజీ మహరాజ్, గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, వ్యవస్థాపకులు జిన్నారం పెద్దగౌని రమాదేవి శివకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రముఖ వేద పండితులు శాస్త్రుల వామనశర్మ సమక్షంలో విగ్రహ స్థిర ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభం ప్రతిష్ఠ, అష్ట బంధన జీవన్యాసం, కుంభాభిషేకం పూర్ణహుతి ఘనంగా నిర్వహించారు. గురువారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ప్రభుత్వసలహాదారులు వేణుగోపాల్ దంపతులు, సీఎంవో మాజీ ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు దంపతులు, టీపీసీసీ కార్యదర్శి రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, గ్రంథాయల సంస్థ చైర్‌పర్సన్ సువాసిని రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావు పాల్గొన్నారు. అలాగే, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ట్రస్ట్ సభ్యులు రమణ గౌడ్, తాజా మాజీ సర్పంచ్ స్వరాజ్యలక్ష్మి శ్రీనివాస్‌గౌడ్, ఆలయ ట్రస్టు సభ్యులు బిక్షపతి యాదవ్, మాజీ ఎంపీపీ హరికృష్ణ, మాజీ జెడ్పీటీసీ మహేష్ గుప్తా పాల్గొన్నారు.

## ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్‌లకు సన్మానం



డ్రైవర్ కండక్టర్‌ను అభినందిస్తున్న ఎండీ వీసీ సజ్జనార్

గజ్వేల్ రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపోలో పని చేస్తున్న డ్రైవర్, కండక్టర్‌లను సంస్థ ఎండీ సజ్జనార్ అభినందించారు. ఇటీవల జగదేవ్‌పూర్ వద్ద ఓ ప్రయాణికుడు బస్సులో మర్చిపోయిన నగదు, బంగారాన్ని కండక్టర్ ఎల్. ఓంప్రకాష్, డ్రైవర్ ఎస్‌డి సలీంలు గుర్తించి, వాటిని తిరిగి ప్రయాణికుడికి అందజేశారు. విషయం తెలుసుకున్న టీజీఎస్ ఆర్టీసీ సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ గురువారం డిపో మేనేజర్ పవన్, డ్రైవర్, కండక్టర్లను అభినందించి వారిని ఘనంగా సన్మానించారు.

## వైభవంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

అల్లాదుర్గం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాందాపూర్ గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయ విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెల్లవారుజామునుంచే పురోహితులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన భక్తులతోపాటు రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతితో పాటు పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## నేటి నుంచి లలితాంబిక దేవి ప్రతిష్ఠాపన ఉత్సవాలు...

నారాయణఖేడ్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని మనూరు క్రాస్‌రోడ్స్ వద్ద నిర్మించిన లలితాంబిక దేవి ఆలయంలో ఈనెల 6 నుండి 8 వరకు ప్రతిష్ఠాపన ఉత్సవాలను నిర్వహించనున్నట్లు దేవి ఉపాసకులు శివపంతులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

# ఉజ్వల భవితకు 'నవోదయ'ం

**ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ - చివరి తేదీ ఈ నెల 29, ప్రవేశ పరీక్ష డిసెంబర్ 13న**

వర్గల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన జవహర్ నవోదయ విద్యాలయాల్లో వచ్చే విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ ఉన్నత ప్రామాణాలతో కూడిన అధునాతన విద్యను అందించడం, వారిలో ఉత్తమ విలువలను పెంపొందించడంతో పాటు క్రీడలు, వ్యాయామ విద్యలో సమున్నత శిక్షణను నివ్వడం నవోదయ విద్యాలయం ప్రత్యేకత. అంతర్జాతీయ విద్యాలయాల తరహాలో చదువులతో పాటు ఐఐటీ, నీట్ ప్రవేశ పరీక్షలకు శిక్షణ, వ్యక్తిత్వ వికాసం ఇక్కడ చదువులో బాగం చేశారు. 6వ తరగతి నుంచి 12 తరగతి వరకు నామమాత్రపు ఫీజులతో విద్యాబోధన సాగుతుంది. త్రిభాషా సూత్రాన్ని అమలు చేస్తారు. దీంతో తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల పట్ల విద్యార్థులకు మంచి పట్టు లభిస్తుంది. వచ్చే విద్యా సంవత్సరం (2026-27)లో 6వ తరగతిలో చేరడానికి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని నవోదయ విద్యాలయ సమితి నోటిఫికేషన్ జారీ చేసింది. విద్యార్థులు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. ఉమ్మడి మెదక్ జిల్లా (సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్) జిల్లాలకు కలిపి 80 మంది విద్యార్థులకు మాత్రం ప్రవేశాలు ఉంటాయి.

**సీబీఎస్ఈ సిలబస్**

నవోదయలో సీబీఎస్ఈ సిలబస్ ప్రకారం 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యాబోధన చేస్తారు. పూర్తిస్థాయిలో రెసిడెన్షియల్ సదుపాయాలు ఉంటాయి. విద్యార్థుల్లో జాతీయ సమైక్యత భావం పెంపొందించేందుకు మైగ్రెషన్ విధానంలో విద్యార్థులను ఏడాది పాటు హిందీయేతర రాష్ట్రాలనవోదయలకు పంపుతారు. ఈ పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్ విధానం అమలులో ఉంది. చదువులతో పాటు ఆటలు, పాటలతో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి నవోదయ ఎంతో కృషి చేస్తుంది. రాష్ట్రంలో ఏ నవోదయలో లేని విధంగా మన నవోదయ విద్యాలయంలో 400 మీటర్ల ట్రాక్‌తో కూడిన స్టేడియం, వాలిబాల్, బాస్కెట్‌బాల్, పుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో కోర్టులు, జిమ్ ఏర్పాటు చేశారు. ఇద్దరు వ్యాయామ ఉపాధ్యాయులు ఆటలలో తర్ఫీదునిచ్చేందుకు నియమితులయ్యారు. సంగీత శిక్షణ కోసం మ్యూజిక్ టీచర్, డ్రాయింగ్‌లో ప్రావిణ్యత పెంచేందుకు డ్రాయింగ్ టీచర్ ఉన్నారు. అత్యవసర వైద్య సేవలకు గాను స్టాఫ్ నర్స్, హెల్త్ సెంటర్ ఉన్నాయి.




**ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు**

6వ తరగతి ప్రవేశానికి విద్యార్థులు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ముందుగా నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్ డబ్లూడబ్లూడబ్లూ. నవోదయ. జీవోవి. ఇన్‌లో తగిన వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థి పాస్ పోటో, సంతకం అప్లోడ్ చేయవలసి ఉంటుంది. వాటితో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో ధ్రువీకరణ తప్పనిసరి. ఈ నెల 29లోపు దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీగా నిర్ణయించారు. డిసెంబర్ 13న రెండో మంగళవారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. మొత్తం 80 సీట్లుకు గాను గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75శాతం, పట్టణ విద్యార్థులకు 25శాతం సీట్లు రిజర్వు చేస్తారు. అందులో దివ్యాంగులకు 3శాతం, షెడ్యూల్ కులాలకు 15 శాతం, షెడ్యూల్ తెగలకు 7 శాతం కనీస రిజర్వేషన్ ఉంటుంది. మొత్తంలో బాలికలకు 33 శాతం సీట్లు రిజర్వు చేస్తారు. ఎంపిక పరీక్షలో 50 శాతం మేధాశక్తి, 50 శాతం గణితం, భాష సామర్థ్యంకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. అబ్జెక్టివ్ టైప్‌లో ఉండే ప్రశ్నలకు రెండు గంటల్లో సమాధానాలు గుర్తించాలి.

విద్యార్థులు ఉమ్మడి మెదక్ జిల్లాలోనే నివాసం ఉండాలి. చదువుతున్న జిల్లాలోనే 2025-26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ లేదా ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలో అయిదో తరగతి చదువుతూ ఉండాలి.



మూడు, నాలుగు తరగతులు పూర్తి విద్యాసంవత్సరం చదివి ఉత్తీర్ణులై ఉండాలి. తేది 1-5-2014 నుంచి 30-7-2016 తేది మధ్య జన్మించి ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ అభ్యర్థి రెండోసారి ప్రవేశ పరీక్ష వ్రాసేందుకు అనుమతి లేదు.

### విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి



విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి జవహర్ నవోదయ విద్యాలయాలు కృషి చేస్తున్నాయి. నిపుణులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన, విశాలమైన క్రీడా మైదానం, స్మార్ట్ క్లాస్‌రూమ్, కంప్యూటర్ విద్యతో పాటు అన్ని వసతులు ఉన్నాయి. విద్యతో పాటు విద్యార్థికి ఆసక్తి కనబరిచే క్రీడా, సాంస్కృతిక విభాగం, చిత్రలేఖనంతోపాటు తదితర విషయాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆరో తరగతిలో చేరాలనుకునే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకునే చివరి తేదీ జూలై 29, పూర్తి వివరాల కోసం నవోదయ వెబ్ సైట్‌ను సందర్శించాలి.

**-దాసి రాజేందర్, ప్రిన్సిపాల్,**
**జవహర్ నవోదయ పాఠశాల, వర్గల్**

# గోమాతలను రక్షిస్తే కేసులా.?

**ధర్మప్రసార్ రాష్ట్ర కో కన్వీనర్ సుభాష్ చందర్**



సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు

సంగారెడ్డి రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గోమాతలను రక్షిస్తే కేసులు బనాయిస్తారా, ఇదెక్కడి న్యాయమని ధర్మప్రసార్ రాష్ట్ర కో కన్వీనర్ సుభాష్ చందర్ ప్రశ్నించారు. గోమాతలను రక్షించిన హిందూ బాంధవులపై కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ గురువారం వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది టన్నుల గోమాంసాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తున్నారని, గోవును కాపాడేందుకు ఉమ్మడి రాష్ట్రంలో 1977లో చట్టం తీసుకువచ్చిందని, ప్రస్తుతం తెలంగాణలో ఈ చట్టం అమలులో ఉన్నా చట్టవిరుద్ధంగా రాష్ట్రంలో గోవధ విచ్చలవిడిగా జరుగుతుందని అన్నారు. గోరక్ష సంస్థలు గోవులను కాపాడే ప్రయత్నం చేస్తే వారిపైనే దాడులు చేస్తూ కేసులు బనాయించడం దారుణమన్నారు. రాష్ట్రంలో చట్టవిరుద్ధంగా కొనసాగుతున్న గో వధశాలలను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు. గుర్తింపు పొందిన గోశాలలకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రభుత్వమే గోశాలలను ఏర్పాటు చేయాలన్నారు. గో ఆధారిత వ్యవసాయం చేస్తున్న రైతులకు, గోపోషకులకు ప్రోత్సాహకాలందించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు పవన్, రాష్ట్ర నాయకులు బ్రహ్మానందం గౌడ్, జిల్లా నాయకులు ప్రకాష్, రవి, బజరంగ్ దళ్ నాయకులు ప్రభుగౌడ్, సురేష్, మనోజ్, లక్ష్మణ్, తరుణ్, వెంకట్, సృజన్, బీజేపీ నాయకులు మాణిక్‌రావు, నాగరాజు, ద్వారక రవి, వాసు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

**ఎస్పీకి వినతిపత్రం**

సంగారెడ్డి క్రైం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గోరక్ష చట్టాలు కఠినంగా అమలు చేయాలని వీహెచ్‌పీ నాయులు కోరారు. ఈ మేరకు వారు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. బక్రీద్ సందర్భంగా గోరక్షకులు ఆవులను పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చేందుకు గోరక్షకులకు గుర్తింపు పత్రాలు ఇవ్వాలని వారు ఈ సందర్భంగా ఎస్పీని కోరారు.

### అమీన్‌పూర్ మున్సిపాలిటీలో

# వడక్‌పల్లి, జానకంపేట

**రికార్డులు స్వాధీనం చేసుకున్న మున్సిపల్ కమిషనర్**

అమీన్‌పూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వడక్‌పల్లి, జానకంపేట గ్రామ పంచాయతీలను అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి రెండు గ్రామపంచాయతీల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. గతంలోనే ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని కిష్టారెడ్డిపేట, సుల్తాన్‌పూర్, పటేల్‌గూడా, దాయర, ఐలాపూర్, ఐలాపూర్ తండా గ్రామ పంచాయతీలను అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనం చేశారు. దీంతో మండల పరిధిలోని వడక్‌పల్లి, జానకంపేట గ్రామాలు మాత్రమే పంచాయతీలుగా మిగిలిపోయాయి. కేవలం మూడు ఎంపీటీసీ స్థానాలతో రాష్ట్రంలోనే అతి చిన్న మండల పరిషత్‌గా అవతరించాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, రాజకీయ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు గ్రామ పంచాయతీలు, మూడు ఎంపీటీసీ స్థానాలతో ఎంపీపీ, ఒక జడ్పీటీసీ స్థానాన్ని ఏర్పాటు చేయడంపై అంతా ముక్కున వేలేసుకున్నారు. మండలంలో మిగిలిన రెండు పంచాయతీలను సైతం మున్సిపాలిటీలో విలీనం చేయాలని ఉన్నతాధికారులకు వినతిపత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి సైతం మున్సిపాలిటీలో విలీనం చేయాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. దీంతో దిగివచ్చిన అధికారులు అమీన్‌పూర్ మండల పరిషత్, పంచాయతీలను రద్దు చేస్తూ అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనం చేస్తూ గజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో పంచాయతీలు లేని మండలంగా అమీన్‌పూర్ మున్సిపాలిటీ అవతరించింది. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, టీపీఓ ప్రవీణ్, ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మెదక్ కోర్టు ఆవరణలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ




సంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న జిల్లా అదనపు న్యాయాధికారి

## మొక్కలు నాటిన న్యాయాధికారులు

సంగారెడ్డి క్రైం/మెదక్ అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవంలో భాగంగా గురువారం మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ నీలిమకోర్టు ఆవరణలో మొక్కలు నాటి, నీరు పోశారు. కార్యక్రమంలో సెక్రటరీ, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ జడ్జి సుభవల్లి, సీనియర్ సివిల్ జడ్జి రుబీనాఫాతిమా, జూనియర్ సివిల్ జడ్జి సిరి సౌజన్య పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా మొదటి అదనపు న్యాయాధికారి కె.జయంతి మొక్కలు నాటారు. కార్యక్రమంలో రెండో అదనపు జిల్లా న్యాయాధికారి పీపీ కృష్ణార్జున, మూడో అదనపు జిల్లా న్యాయాధికారి సునీత రవీంద్రారెడ్డి, నాలుగో అదనపు జిల్లా న్యాయాధికారి లావణ్య, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి తేజో కార్తీక్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి దీప్తి, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి అనిత, జూనియర్ సివిల్ జడ్జి టి. దుర్గా రాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

### ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రామచంద్రాపురం టౌన్ జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని వివరించారు. ఎస్ఎస్‌సీ మెమో, టీసీ, కులధ్రువీకరణ, ఆధార్‌కార్డు, అభ్యర్థి ఫోటోలను ఆన్‌లైన్‌లో ఈనెల 21 తేదీ లోపు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థి ఫోన్ నంబర్, మెయిల్ ఐడీతో రిజిస్టర్ అవ్వాల్సి ఉంటుందని చెప్పారు. ఆన్‌లైన్‌లో రిజిస్టర్ అయిన తరువాత ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం వస్తుందని వివరించారు. ఏడు విభాగాల్లో 172 సీట్లు ఉన్నాయని చెప్పారు. కంప్యూటర్ డేటా ఎంట్రీ ఆపరేటర్ 48, ఎలక్ట్రికల్, ఫిట్టర్, మెషనిస్ట్, టర్నర్, వెల్డర్ విభాగాల్లో 20 చొప్పున సీట్లు ఉండగా మెకానిక్ మోటారు వెహికల్ విభాగంలో 24 ఖాళీలు ఉన్నాయి. వీటిని రిజర్వేషన్‌ల నిబంధనలకు అనుగుణంగా ఖాళీలు భర్తీ చేస్తామని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు తెలిపారు.

# అడిగినంత ఇస్తేనే సర్టిఫికెట్

**మీ సేవ కేంద్రాల్లో దోపిడీ**

**ఇష్టారాజ్యంగా వసూళ్లు**

**అధికారులతో కుమ్మక్కై పనులు**

మీ సేవ
సులభంగా, వేగంగా

పటాన్‌చెరు రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఇప్పుడు ఏ ధ్రువపత్రం కావాలన్నా మీ సేవ కేంద్రాల వద్దకు వెళ్లాల్సిందే. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు మీ సేవ కేంద్రాల నిర్వాహకులు దరఖాస్తుదారులను దోచుకుంటున్నారు. దళారుల ప్రమేయం లేకుండా ధ్రువపత్రాలు పొందేందుకు ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2011లో మీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రతి సేవకు కొంత రుసుమును నిర్ణయించింది. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఇటీవల ప్రభుత్వం కొత్తగా మీ సేవ కనెక్ట్ యాప్‌ను అమల్లోకి తెచ్చింది. ఇదివరకు ఉన్న టీ యాప్ ఫోలియోను పేరు మార్చి మీ సేవ యాప్‌ను ప్రారంభించింది. దీనిలో మీ సేవ కేంద్రాలలో అందిస్తున్న సేవలన్నీ పొందే వెసులుబాటు కల్పించింది. దాని ప్రకారం నిర్వాహకులకు కమీషన్ రూపంలో కొంత చెల్లిస్తున్నారు. రెవెన్యూ, వ్యవసాయం, పోలీసు, విద్య, వైద్యం, విద్యుత్ ఇలా వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి సుమారు 300లకు పైగా పౌర సేవలను మీ సేవ కేంద్రాలలో పొందే వెలుసు బాటు కల్పించారు. తాజాగా మరో తొమ్మిది సేవలను అమల్లోకి తెచ్చారు.

**దరఖాస్తుకో ధర**

పలు రకాల ధ్రువపత్రాల కోసం మీసేవ కేంద్రాలకు వెళ్లిన ప్రజలకు పలువురు మీసేవ నిర్వాహకులు దరఖాస్తుకో ధర చెప్తూ ప్రజలను భారీగా దోచుకుంటూ, రెవెన్యూ, మున్సిపల్ తదితర ప్రభుత్వ యంత్రాంగాలకు దళారులుగా వ్యవహరిస్తున్నారు. కొన్ని రకాల సర్టిఫికెట్లకు ఒక్కో ధరను చెపుతూ సామాన్యులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రెవెన్యూ, మున్సిపల్ తదితర ప్రభుత్వ కార్యాలయాలలో పలువురు ఉద్యోగులతో సంబంధాలు కొనసాగిస్తున్న పలువురు మీసేవ నిర్వాహకులు ప్రజల నుంచి దోచుకున్న సొమ్మును కొంతమేర వారికి అందిస్తూ పనులు యథేశ్చగా కానిచ్చేస్తున్నారు. దీంతో వీరు చెప్పినట్టు డబ్బు చెల్లించకపోతే వారి దరఖాస్తులు ఎక్కువ శాతం రిజెక్ట్ అవుతున్నాయన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. పలువురు మీసేవ నిర్వాహకులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలను పక్కన పెట్టి ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారని ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. కొన్ని రకాల సర్టిఫికెట్ల కోసం నోటరీ సమర్పించాల్సి ఉండగా, నోటరీ బాండ్లు కూడా నిబంధనలకు వ్యతిరేకంగా మీ సేవ నిర్వాహకుల వద్ద రెడీగా ఉండటంతో నోటరీ ధరలు కూడా బాండు ధరను మించి అధికంగా వసూలు చేస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులు కుల ఆదాయ, పుట్టిన రోజు ఇతర ధ్రువపత్రాల కోసం రెవెన్యూ, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని, మీసేవ నిర్వాహకులు చెప్పినట్లు డబ్బులు చెల్లించిన వారికి తొందరగా సర్టిఫికెట్లు వస్తున్నాయని పలువురు ఆరోపించడం గమనార్హం. వీళ్ల చెప్పినట్లు డబ్బులు చెల్లించని వారి దరఖాస్తులను తమ వద్ద కాదంటూ వెనక్కు పంపించడం పలు మీ సేవ కేంద్రాల్లో పరిపాటిగా మారింది.

**పుట్టిన తేదీ సర్టిఫికెట్ కోసం రూ. 3 వేలు**

విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న తరుణంలో ఆధార్ కార్డు కోసం తన కుమార్తెలకు పుట్టినరోజు సర్టిఫికెట్ అవసరం అయింది. గతంలో మూడువేలు ఇచ్చి చేయించాను. అందులో తల్లిదండ్రుల ఇంటి పేర్లు రాలేదు. దాన్ని సరిదిద్దటానికి మళ్లీ మూడు వేలు అడుగుతున్నారు. ఇళ్లల్లో పని చేసుకునే నాకు ప్రతీ సారి అంత ఇవ్వాలంటే సాధ్యం అవుతుందా?

**-సంధ్య, బాధితురాలు**

**అక్రమంగా వసూలు చేస్తే చర్యలు**

మీ సేవ కేంద్రాల్లో అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవు. ఇస్నాపూర్‌లో ప్రభుత్వం నిబంధనలకు వ్యతిరేకంగా డబ్బులు వసూలు చేస్తున్న ఒక మీ సేవ కేంద్రం పై ఇటీవలే చర్యలు తీసుకున్నాం. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలి. మీసేవ కేంద్ర నిర్వాహకులతో కలిసి రెవెన్యూ సిబ్బంది ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటాం.

**- రంగారావు, తహసీల్దార్, పటాన్‌చెరు**

న్యూస్ బాక్స్

## 43 మంది గైర్హాజరు

సంగారెడ్డి అర్బన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. గురువారం నిర్వహించిన తృతీయ భాష పరీక్షకు 78 మందికి 35 మంది హాజరుకాగా 43 మంది గైర్హాజరయ్యారు. 44.87 హాజరు శాతం నమోదైందని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

## ప్రభుత్వ భూములను పరిశీలించిన అధికారులు



ప్రభుత్వ భూముల రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

పెద్దశంకరంపేట, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దశంకరం పేటలోని ప్రభుత్వ భూములను మెదక్ ఆర్డీవో రమాదేవి, మెదక్ డీపీవో యాదయ్య గురువారం పరిశీలించారు. గతంలో జీవో నంబరు 58, 59 కింద దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సేకరించి, సర్వే నంబరు 1, సర్వే నంబర్ 258లోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా డీఎల్‌పీవో సురేష్‌బాబు, తహసీల్దార్ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీడీవో షాకీర్‌అలీ, ఆర్ఐ రమేష్ తదితరులు ఉన్నారు.

## సాధారణ యోగా ప్రోటోకాల్‌పై శిక్షణ

రామాయంపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఆయుష్ శాఖ ఆదేశానుసారం జరుగుతున్న యోగాపై అవగాహన, శిక్షణా కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆశా వర్కర్లు, అంగన్వాడీలు, మెప్మా సిబ్బందికి శిక్షకులు మద్దెల భరత్ ఆధ్వర్యంలో సాధారణ యోగా ప్రోటోకాల్ గురించి వివరించారు. కార్యక్రమంలో ధ్యానం, ప్రాణాయామాలపై శిక్షణ ఇచ్చారు.

## టాలెంట్ టెస్ట్

మెదక్ కల్చరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మెదక్ మిల్లీ గ్రూప్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ముస్లిం షైనార్టీ ఫంక్షన్ హాల్‌లో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. దాదాపు 96 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సోఫీ సుజాయత్ అలి, ఉమర్ ఖాన్ రియాజుద్దీన్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అత్యుత్తమ మార్కులు పొందిన పదిమందికి నగదు ప్రోత్సాహకం అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో అల్ హజ్ జావిద్ అలీ, జుబేర్ అహ్మద్, అంజత్, అహ్మద్, జంషీద్, యూసుఫ్, సఫ్దర్, తదితరులు పాల్గొన్నారు

## పాఠ్య పుస్తకాల పంపిణీ

నారాయణఖేడ్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఖేడ్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు గురువారం పాఠ్య పుస్తకాల పంపిణీ చేశారు. మండలంలోని విద్యార్థుల అవసరం మేరకు 95 శాతం వరకు పుస్తకాలు రాగా, వాటిని ఖేడ్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో డంపు చేశారు. దీంతో మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వచ్చి తమ తమ పాఠశాలలకు అవసరమైన పుస్తకాలను తీసుకువెళ్తున్నారు. ఈ సారి పాఠశాలల పునః ప్రారంభం రోజునే విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేయనున్న నేపథ్యంలో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.



తొరగర్‌పల్లి పాఠశాల భవనం గోడలో పెరిగిన చెట్టు, బీటలు వారిన తరగతి గదిగోడ



మారేపల్లి పాఠశాలలో విద్యుత్ స్తంభాన్ని కలుపుతూ నిర్మించిన భవనం

# బడులు భద్రమేనా?

- ప్రమాదకరంగా భవనాలు
- గదులకు ఆనుకునే విద్యుత్ తీగలు
- శిథిలావస్థలో మరుగుదొడ్లు

కొండాపూర్, జూన్5 (ఆంధ్రజ్యోతి): బడిబాట సరే.. కానీ బడుల భవనాలు భద్రమేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కొండాపూర్ మండలం పరిధిలోని పలు గ్రామాల ప్రభుత్వ పాఠశాలల భవనాలు అత్యంత దయనీయ పరిస్థితుల్లో ఉన్నాయి. చాలాచోట్ల అదనపు తరగతి గదులు లేక ఆరుబయట చదువులు సాగించాల్సిన దుస్థితి నెలకొన్నది. మరికొన్ని చోట్ల కనీస వసతులైన మూత్రశాలలు, తాగునీరు అందుబాటులో లేవు. ఉన్న భవనాలు కూడా శిథిలావస్థకు చేరి రేపోమాపో కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇది చాలదన్నట్లు బోధన గదులకు విద్యుత్ స్తంభాలను కలుపుతూ భవనాలను నిర్మించడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచట్లో నిధుల కొరతతో అర్ధాంతరంగా నూతన భవనాల పనులు నిలిచిపోయాయి. ఇలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో పిల్లలను ప్రభుత్వ బడులకు ఎలా పంపించాలని పలువురు తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ బడుల భవనాలకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



నిరుపయోగంగా మూత్రశాలలు

# దశలవారీగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు
- పేదల సొంతింటి కల సాకారం చేస్తాం : మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ అర్బన్/నారాయణఖేడ్/రాయికోడ్/ ఝరాసంగం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ రాజ్‌తో కలిసి ఆయన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కార్ 14 నెలల్లోనే నియోజకవర్గ అభివృద్ధిని కాంక్షిస్తూ.. ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పేదల సొంతింటి కల ఆశయాన్ని సాకారం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, హౌసింగ్ పీడీ మాణిక్యం, డీపీవో యాదయ్య, ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు. అలాగే నారాయణఖేడ్ మండల పరిధిలోని హన్మంత్‌రావుపేట్, మాద్వార్‌తండా, లింగాపూర్, లింగనాయక్‌పల్లి, మాద్వార్, గునుకుల కుంట, పోతన్‌పల్లి గ్రామాల్లో ఇందిరమ్మ గృహాల పనులను స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రారంభించారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, హౌసింగ్ డిప్యూటీ ఈఈ సతీష్‌తివారి తదితరులు పాల్గొన్నారు. రాయపూర్ మండల పరిధిలోని పిపడ్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్ల అంజయ్య భూమి పూజ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాలాజీనర్సింలు, మాజీ జడ్పీటీసీ సుభాష్‌పాటిల్, ఏఎంసీ వైస్ చైర్మన్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఝరాసంగం మండల పరిధిలోని జొనెగావ్, గుంతమర్పల్లి, కొలూర్ గ్రామాల్లో ఇందిర్మ ఇళ్ల నిర్మాణాలకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హనుమంతు రావు పాటిల్ భూమి పూజ చేశారు. ఎంపీడీవో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్ రాజ్



ఖేడ్ మండలం హన్మంత్‌రావుపేటలో ఇంటి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

# కాంగ్రెస్ బలోపేతానికే కమిటీలు

- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

రామాయంపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడానికే కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. రామాయంపేట మండల పరిధిలోని ముఖ్య నాయకులు కార్యకర్తలతో గురువారం కొంపల్లిలోని తన నివాసంలో సమావేశమయ్యారు. అంతకు ముందు అన్ని గ్రామాల నూతన కమిటీలను ప్రకటించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి సుప్రభాత రావు, మాజీ ఎంపీపీ రమేష్ రెడ్డి, నాయకులు అల్లాడి వెంకటి,చింతల స్వామి, ఎనిశెట్టి అశోక్, పోచమ్మల అశ్విని తదితరులు ఉన్నారు.



నూతన కమిటీలు ప్రకటిస్తున్న హనుమంతరావు

## పలు గ్రామాల్లో ఈజీఎస్ పనుల సామాజిక తనిఖీ

సిర్గాపూర్/కల్హేర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ మండలంలో నాలుగవ విడత ఈజీఎస్ సామాజిక తనిఖీ గ్రామ సభలను గురువారం నిర్వహించారు. కడ్పల్, లక్ష్మణ్‌నాయక్ తండా, సూర్యాతండా, సుల్తానాబాద్, వగ్దల్, పోట్‌పల్లి, చిన్న ముబారక్‌పూర్, ఉజలంపాడ్ గ్రామాల్లో సభలు నిర్వహించారు. ఏపీవో బస్వరాజ్, ఎస్ఆర్పీ రాజు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.



లక్ష్మణ్‌నాయక్ తండా గ్రామ సభ



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## నీటి ఎద్దడిని పరిష్కరించాలి

- ఎంపీ రఘునందన్‌రావుకు వినతి

జిన్నారం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కాజీపల్లిలో నెలకొన్న నీరు, రహదారుల సమస్యలు పరిష్కరించాలని అఖిలపక్షం నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం ఎంపీ రఘునందన్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. కొన్ని నెలలుగా తీవ్రమైన నీటి ఎద్దడి ఉందన్నారు. గ్రామ ప్రజల అవసరాల మేరకు నీటి సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా గండి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి తగ్గింపు, రహదారుల నిర్మాణం, అటవీ శాఖ నుంచి గ్రామానికి చెందిన భూముల విషయంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ భార్గవ్, నాయకులు నవీన్‌కుమార్, రమాకాంత్, కొండా రాజు, ఆంజనేయులు, రాములుగుప్తా, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల బలోపేతానికే బడిబాట

- మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ అర్బన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే బడిబాట కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. ఈ నెల 6 నుంచి జూన్ 19 వరకు నిర్వహించే బడిబాటపై గురువారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పంచాయతీ సెక్రటరీలు, ఉపాధ్యాయులు సమన్వయంతో గ్రామ సభలు నిర్వహించి ప్రభుత్వ విద్య ప్రాముఖ్యతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు భాగస్వామ్యం కావాలన్నారు. జూన్ 8 నుంచి 10వ తేదీ వరకు మూడు రోజులపాటు ఇంటింటికీ తిరిగి పిల్లలందరూ పాఠశాలలో చేరేలా చూడాలన్నారు. సమావేశంలో డీఈవో రాధాకిషన్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి, ఇంటర్ నోడల్ అధికారి మాధవి, వివిధ సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చిరు ధాన్యాల సాగుపై దృష్టి సారించాలి

- జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ శాస్త్రవేత్త సేవానాయక్



కరపత్రాలు అందజేస్తున్న శాస్త్ర వేత్తలు, ఏడీఏ నూతన్‌కుమార్

సిర్గాపూర్/కల్హేర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : ఎన్నో పోషక విలువలు ఉండే చిరు ధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డి.సేవానాయక్ అన్నారు. సిర్గాపూర్ మండలం వాసర్ గ్రామంలో గురువారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్, జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుచూ చిరుధాన్యాల్లోని పోషకాలు, ప్రభుత్వ పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటారు. నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్, సిర్గాపూర్ ఏవో హరిక్రిష్ణ, రైతులు పాల్గొన్నారు.

## విత్తన శుద్ధిపై అవగాహన

చేగుంట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ మండలం శంఖాపూర్ గ్రామంలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం హైదరాబాద్ సౌజన్యంతో రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి ఉదయశంకర్, మండల సహాయ విస్తీరణాధికారి విజృంభణ తదితరులు పాల్గొన్నారు.

## గాయానికి కనీసం కుట్లు వేయలేరా?

- మనోహరాబాద్ పీహెచ్‌సీ సిబ్బంది నిర్లక్ష్యం
- కుట్ల కోసం బాధితుడికి తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లమని సూచన
- జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేసిన బాధితులు

మనోహరాబాద్ జూన్ 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి మనోహరాబాద్ పీహెచ్‌సీకి వచ్చిన బాధితుడిపట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారు. బాధితుడి కథనం మేరకు మనోహరాబాద్ మండలం పాలాట గ్రామానికి చెందిన మిరుదొడ్డి రామకృష్ణ(24) బుధవారం మధ్యాహ్నం రెండు వాహనాలు ఢీ కొన్న ఘటనలో కాలుకు తీవ్ర గాయమైంది. వెంటనే అతడిని స్నేహితులు మనోహరాబాద్ పీహెచ్‌సీకి తీసుకెళ్లగా మండల వైద్య అధికారి జోత్స్నదేవి పరిశీలించి గాయాన్ని సిబ్బందితో కలిసి క్లీన్ చేశారు. కాలుకు కుట్లు వేయాల్సి ఉందని, వెంటనే తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో వారు దిక్కుతోచని స్థితిలో దగ్గరలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా సుమారు రూ.15 వేల బిల్లు అయ్యింది. కనీసం కుట్లు వేయని స్థితిలో పీహెచ్‌సీ సిబ్బంది ఉన్నారా అని బాధితుడి కుటుంబ సభ్యులు, స్నేహితులు మండిపడ్డారు. ఈ విషయమై గురువారం జిల్లా వైద్యాధికారికి ఫోన్‌లో వివరించగా, రాత పూర్వకంగా రాసి మొబైల్ ఫోన్‌కు పంపించాలని సూచించినట్లు వారు తెలిపారు. ఈ ఘటనపై వివరణ కోరేందుకు మండల వైద్య అధికారిని ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.



ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

## 'మెరుగైన వైద్య సేవలందించాలి'

హత్నూర, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన హత్నూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి గాయత్రిదేవి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ రికార్డులను పరిశీలించారు. సిబ్బంది ఎప్పుడు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఆమె వెంట మెడికల్ ఆఫీసర్ రజిని, సిబ్బంది ఉన్నారు.

## ఐడీఏబొల్లారంలో వందరోజుల ప్రణాళిక

ఐడీఏబొల్లారం జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : వందరోజుల ప్రణాళికతో పరిశుభ్రత సాధిస్తామని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం ఐడీఏబొల్లారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని అభివృద్ధి చేయడమే కాకుండా ఇంటింటి పరిశుభ్రత పాటించేటట్లు అవగాహన తెస్తున్నామని చెప్పారు. వందరోజుల ప్రణాళికతో అన్ని కాలనీల్లో వ్యర్థాలు లేకుండా చేయడానికి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని అన్నారు.

# 'భూభారతితో భూ సమస్యలకు చెక్'

- ఊరూరా రెవెన్యూ సదస్సులు
- హాజరైన మెదక్, సంగారెడ్డి కలెక్టర్లు రాహుల్ రాజ్, వల్లూరు క్రాంతి





పటాన్‌చెరు రూరల్: రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

న్యూస్ నెట్‌వర్క్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి చట్టంతో భూ సమస్యలకు చెక్ పడనుందని కలెక్టర్లు, అధికారులు తెలిపారు. గురువారం సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పటాన్‌చెరు మండలం, క్యాసారం గ్రామంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ అవగాహన సదస్సులో సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు పాల్గొని ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రామంలో మొక్కలను నాటి నీరు పోసారు. ఆన్‌లైన్ ప్రక్రియను త్వరితంగా పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కొల్చారం మండల పరిధిలోని రంగంపేట గ్రామంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సుకు మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ హాజరై మాట్లాడారు. సాదాబైనమ ప్రభుత్వం ప్రకటించిన సంవత్సరం వరకు సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. అల్లాదుర్గం మండలం సీతానగర్, రేగోడు మండలంలోని జగిర్యాల నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొన్నారు. అనంతరం సీతానగర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో మొక్కలను నాటారు. అలాగే చౌటకూర్ మండలం సరాఫ్‌పల్లి గ్రామంలో నిర్వహించిన సదస్సుకు అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు, ఎర్దనూర్, ఎద్దుమైలారం, చేర్యాల గ్రామాలలో సంగారెడ్డి ఆర్డీవో రవీందర్ రెడ్డి, పెద్దశంకరంపేట మండల పరిధిలోని కమలాపూర్‌లో మెదక్ ఆర్డీవో రమాదేవి, హస్తాల్‌పూర్, ఎదులపల్లి గ్రామాల్లో తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా ఝరాసంగం మండల పరిధిలోని ప్యాలవరం, ఏడాకులపల్లి తదితర గ్రామాల్లు, సంగారెడ్డి మండలం కులబ్‌గూర్, కొత్లాపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు.



అల్లాదుర్గం మండలంలోని సీతాగనర్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్



సంగారెడ్డి కలెక్టరేట్‌లో చిన్నారులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేసిన డీఆర్‌వో పద్మజారాణి



రామయంపేట: అక్కన్నపేటలో మొక్కలు నాటుతున్న ఫారెస్ట్ రేంజర్, రెడ్ క్రాస్ ప్రతినిధులు

# 'పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం'

- ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం
- అవగాహన ర్యాలీలు, మొక్కల నాటడం తదితర కార్యక్రమాలు చేపట్టిన అధికారులు

న్యూస్ నెట్‌వర్క్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పలువురు వక్తలు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని పలు గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాప్రతినిదులు, అధికారులు, నాయకుల ఆధ్వర్యంలో ఊరూరా అవగాహన ర్యాలీలు, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పలు పరిశ్రమల ఆవరణలో మొక్కలు నాటడంతో పాటు కార్మికులతో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. నారాయణఖేడ్ మండలం వెంకటాపూర్ సమీపంలోని అటవీ శాఖ నర్సరీలో స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి మొక్కలు నాటారు. బావి తరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని విధిగా మొక్కలను నాటి పెంచాలన్నారు. ఆయా ప్రాంతాల్లో అటవీ శాఖ అధికారులు మొక్కలు నాటారు.



నర్సాపూర్ కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న జడ్జి తదితరులు



మనోహరాబాద్ : రంగాయపల్లి ఎమ్ఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో మొక్క నాటుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

## చెరువు గట్టున.. చేపల కొలనులు

(5వ పేజీ తరువాయి)

ఉంటుందని మత్స్యకారులు పేర్కొంటున్నారు. నీటి వసతి లేని ప్రాంతంలో బోరు వేసి మోటారును చేపల కొలను పథకంలో భాగంగానే ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**రూ.9.62 లక్షలతో నిర్మాణం**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చేపల కొలనులను నిర్మాణం చేసేందుకు నిర్ణయించారు. కొలనుల నిర్మాణానికి రూ.9.62 లక్షలుగా అంచనా వేశారు. చెరువు సమీపంలో బఫర్‌జోన్‌లో నాలుగు వేర్వేరుగా కొలనులను నిర్మాణం చేయనున్నారు. 25 మీటర్ల పొడవు, 15 మీటర్ల వెడల్పు, 2 మీటర్ల లోతుతో ఒక్కొక్క కొలను నిర్మాణం చేస్తున్నారు. కొలను మధ్యలో మీటరున్నర దూరం ఉండనుంది. కొలను తవ్వకాలలో తీసిన మట్టిని చుట్టూరా బండ్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. గ్రామాల్లోని మత్స్యకార సంఘాలతో అంగీకార పత్రం తీసుకొని కొలనులను నిర్మాణం చేస్తున్నారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా మత్స్యకార సంఘాల సహకారంతో 200 వరకు ఫిష్ పాండ్‌ల నిర్మాణం చేస్తున్నారు. ప్రస్తుతం 50 పూర్తికాగా, మరో 150 కొలనుల పనులు కొనసాగుతున్నాయి.